
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 3 । మే । 2024



ఆశా వర్కర్లకు మొబైల్ ఫోన్లు

గుంటూరు మెడికల్: నూతనంగా విధుల్లో చేరిన ఆశా కార్యకర్తలకు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి గురువారం తన కార్యాలయంలో మొబైల్ ఫోన్‌లు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.90అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



మకర తోరణం వితరణ

చెరుకుపల్లి: పొన్నపల్లి ఎస్టీ కాలనీలోని కోదండ రామాంజనేయస్వామికి పిట్టు కృష్ణారెడ్డి తన కుమారుడు ఏడుకొండలరెడ్డి జ్ఞాపకార్థం మకర తోరణం, వెండి కళ్లు, రాళ్ల బొట్లు అందజేశారు.

న్యూస్‌రీల్

జాతీయ అథ్లెటిక్స్‌లో రేష్మికి బంగారు పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల బెంగళూరులో జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్–1 జాతీయ అథ్లెటిక్ పోటీల్లో భాగంగా జావెలిన్ త్రో విభాగంలో గుంటూరు అథ్లెట్ రేష్మి బంగారు పతకం సాధించిందని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 53.77 మీటర్లు దూరం జావెలిన్ విసిరి తనకు ఎదురులేరని నిరూపించిందన్నారు. గతంలో కూడా రేష్మి పలు జాతీయ పోటీల్లో పాల్గొందన్నారు. ప్రస్తుతం ఆమె సౌత్ సెంట్రల్ రైల్వే టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా రేష్మికి అసోసియేషన్ చైర్మన్ జి.శేషయ్య, రేమండ్స్ అధినేత టి.అరుణ్ కుమార్, డాక్టర్ ఎం.శివకుమార్, అంకాల సుబ్బారావు అభినందించారన్నారు.

11 నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు

కొరిటెపాడు: గుంటూరు మార్కెట్ యార్డుకు ఈనెల 11 నుంచి జూన్ 9వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు గుంటూరు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులోని మిర్చి దిగుమతి, ఎగుమతి, షాపుల కార్మిక సంఘాలు, దిగుమతి వ్యాపారుల సంఘం అభ్యర్థన మేరకు ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వేసవి సెలవులు ఇవ్వడం జరిగిందన్నారు. సెలవు రోజుల్లో యార్డులో క్రయ, విక్రయాలు జరగవని పేర్కొన్నారు. రైతులు తమ సరుకును ఈనెల 10వ తేదీ వరకు మాత్రమే యార్డులోకి తీసుకురావాలన్నారు. జూన్ 10 నుంచి యార్డులో యథావిధిగా క్రయ, విక్రయాలు జరుగుతాయన్నారు. రైతులు సెలవు రోజుల్లో యార్డుకు మిర్చి బస్తాలు తీసుకు రావద్దని సూచించారు. జూన్ 9వ తేదీ అర్ధరాత్రి నుంచి యథావిధిగా రైతులు తమ సరుకు తీసుకు రావచ్చని తెలిపారు.

యార్డుకు 78,281 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 78,281 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 75,376 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,700 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,168 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

మైనార్టీ బాలుర కళాశాలలో నేరుగా ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ మైనార్టీ బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీషా గురువారం ఒప్రకటనలో తెలిపారు. టెన్త్‌లో ఉత్తీర్ణులైన ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన తదితర మైనార్టీ విద్యార్థులు కళాశాలలో సంప్రదించి ప్రవేశం పొందాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశం పొందాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 97014 51826, 98495 59611 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు బండారుపల్లి రైల్వేగేటు మూసివేత

తాడికొండ: మరమ్మతుల కారణంగా ఈనెల 3,4 తేదీల్లో తాడికొండ మండలం బండారుపల్లి రైల్వేగేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు సమాచారం అందించినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మరమ్మతుల కారణంగా రోడ్డుపై రాకపోకలు నిలిపివేస్తున్నారని, ప్రయాణికులు సహకరించాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.6800, మోడల్ ధర రూ.5400 వరకు పలికింది.

బాబు ఏడిపించేను



ప్రత్తిపాడు యూనియన్ బ్యాంకులో పింఛను కోసం నిలువుకాళ్లపై వృద్ధుల, పింఛను లబ్ధిదారుల పడిగాపులు



ప్రత్తిపాడులోని ఓ కియోస్క్ సెంటరు వద్ద పింఛను నగదు కోసం వృద్ధుల నిరీక్షణ

- చంద్రబాబు కుట్రలతో పండుటాకులకు తీవ్ర ఇబ్బందులు
- పెన్షన్ కోసం పడిగాపులు
- ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటివద్దే పెన్షన్ ఇచ్చిన సీఎం జగన్
- నేడు ప్రతిపక్షాల కుట్రలో భాగంగా పెన్షన్ దారుల తీవ్ర ఇబ్బందులు
- బ్యాంకులో పెన్షన్ సొమ్ము జమ చేసినా.. చేతికి రాని పరిస్థితి
- బ్యాంకులు, కియోస్క్‌ల వద్ద అవ్వతాతలు, పింఛన్ దారుల ఆపసోపాలు



ఈ ఫొటోలో ఉన్న వృద్ధురాలు కాబోతు కౌసల్యమ్మ.. కొల్లిపర మండల గ్రామం తూములూరు. పింఛను డబ్బులు బ్యాంకుల్లో పడ్డాయంటే తీసుకోవటానికి ఉదయం తొమ్మిది గంటలకే ఊళ్లోని సెంట్రల్ బ్యాంకుకు చేరుకుంది. మధ్యాహ్నం ఒంటిగంటయినా పింఛను తీసుకోలేక పోయింది. మే ఒకటో తేదీ సెలవు రావటంతో గురువారం బ్యాంకులో రద్దీ నెలకొంది. సాధారణ కస్టమర్లకు తోడు పింఛను కోసమని వచ్చిన వృద్ధులతో కిటకిటలాడింది. పింఛను డ్రాకు ఓచర్లు రాయటం ఎలాగో తెలీదు. వాళ్లనూ వీళ్లను అడుగుతున్నారు. 'రోడ్డుపై బాగా అగ్గేస్తోంది...ఇటీవలే కంటికి శుక్లం ఆపరేషను చేయించుకున్నా...ఈ అగ్గిలో వెళితే కన్ను దెబ్బతింటుందని భయమేస్తోంది. కొన్నేళ్లుగా ప్రతినెల ఒకటో తేదీనే వలంటీరు ఇంటికొచ్చి పింఛను ఇచ్చేవాడు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చెడగొట్టారంట...పోయిన నెల్లో సచివాలయంలో ఇచ్చారు. ఇప్పుడేమో బ్యాంకులో అంటున్నారు. తిరగలేక పోతున్నాం. ఇలా చేసినోళ్లు మాదగ్గరకొచ్చి ఓట్లు ఎలా అడుగుతారు?' అంటూ ప్రశ్నించింది కౌసల్యమ్మ.

ప్రత్తిపాడు, నెహ్రూనగర్, తెనాలి: పండుటాకుల పాలిట విలన్‌లా మారారు చంద్రబాబు నాయుడు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది మొదలు ఒక్కో నెల ఒక్కోలా ఏడిపించుకుతింటున్నాడు. పింఛను సొమ్ము చేతికందకుండా చుక్కలు చూపిస్తున్నాడు. ఆయనతో పాటు ఆయన పార్టీ అనుయాయులు కోర్టులు, ఫిర్యాదులు అంటూ.. గతంలో ఒకటో తేదీనే వేకువజామునే తలుపుతట్టి నగదు చేతికి ఇచ్చే వలంటీర్ల వ్యవస్థను పింఛను ఇవ్వకుండా చేశారు. గత నెల సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తూ పండుటాకులు ముప్పుతిప్పలు పడేలా చేశారు. తాజాగా ఈ నెల కూడా పింఛను సొమ్మును బ్యాంకులకు జమ అయ్యేలా చేసి వారికి మండుటెండలో ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారు. గురువారం ఉదయం బ్యాంకు ఖాతాల్లో పింఛను జమ అయ్యిందో లేదో తెలుసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకులు, కియోస్క్ సెంటర్లు, నగదు లావాదేవీలు జరిగే దుకాణాల వద్ద బారులు తీరారు. గంటల తరబడి నిరీక్షించి నీరసించి పోయారు.

2.60 లక్షల మందికి జమ..

గుంటూరు జిల్లాలో 2.60లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం పింఛన్ సొమ్ము జమ చేసింది. బ్యాంక్ ఖాతాలు లేని 61వేల మందికి డోర్ టూ డోర్ వెళ్లి పెన్షన్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

బ్యాంకుల వద్ద తప్పని పాట్లు

పెన్షన్ కోసం బ్యాంకుల వద్దకు వచ్చిన పెన్షన్‌దారులకు నిరాశే ఎదురయిందని చెప్పుకోవచ్చు. ఇంటి నుంచి తిప్పలు పడుతూ బ్యాంకుల వద్దకు వచ్చినప్పటికీ అక్కడ కూర్చోడానికి సరిపడ కుర్చీలు లేక ఇబ్బందులు పడ్డారు. బ్యాంకు పాస్ బుక్‌తో పాటు ఆధార్ కావాలని అడగటంతో దాని కోసం పక్కన వాళ్లచే తమ కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి తెప్పించుకునేవాళ్లు కొందరైతే.. ఎవరూ లేని వారు నేరుగా తిరిగి ఇంటికి వెళ్లి రావాల్సిన పరిస్థితి. ఆధార్, పాస్ బుక్ ఉంటే కొద్ది కాలంగా లావాదేవీలు లేని కారణంగా అకౌంట్ ఫ్రీజ్ అయిందని చెప్పడంతో మరికొందరు నివ్వెరపోయారు. మళ్లీ ఈకేవైసీ చేయించుకోవాలంటూ తాపీగా చెబుతున్నారు బ్యాంకర్లు.అలాగేనంటూ ప్రయత్నిస్తే బయోమెట్రిక్‌కు వేలిముద్రలు పడక మరో ఇబ్బంది.

కూటమి నేతలపై శాపనార్థాలు

తీరా అన్నీ అయిపోయి నగదు విత్‌డ్రా చేయాలంటే నీకు సంతకం రాదుగా..వేలి ముద్ర అయితే బ్యాంక్ ఖాతాదారుడి సంతకం పెట్టించుకురమ్మంటూ పంపిస్తున్నారు. తిరిగి సదరు బ్యాంక్‌లో ఖాతాదారుడి కోసం కనిపించిన ప్రతి ఒక్కరినీ అడగాల్సిన పరిస్థితి నెలకొంది. మలి దశలో ఉన్న తమను ఇన్ని కష్టాలు పాల్జేసిన కూటమి నేతల్ని వృద్ధులు శాపనార్థాలు పెడుతున్నారు. తెల్లవారకముందే తలుపు తట్టి పింఛన్ ఇచ్చే వలంటీర్లపై, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కక్షకట్టారని, తమకు పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారంటూ మండిపడుతున్నారు.

మందులకు డబ్బులు లేవు



నాకు బ్యాంక్ అకౌంట్ లేదు. ఇంకా పెన్షన్ చేతికి అందలేదు. పెన్షన్ సొమ్ము కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రతి నెల ఒకటో తేదీన వచ్చే పెన్షన్ సొమ్ముతో మందులు కొనుక్కుంటాను. పెన్షన్ రాకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. వలంటీర్లు ఉంటే ఈ అవస్థలు ఉండేవి కాదు.– కొనరాజు బుసమ్మ, క్రిస్టియన్ పేట, గుంటూరు

బ్యాంక్ అకౌంట్ హోల్డ్‌లో ఉందన్నారు



పెన్షన్ సొమ్ము బ్యాంకులో పడిందని తెలిసి.. బ్యాంకుకు వెళ్లాను. తీరా బ్యాంకు అధికారులు నీ అకౌంట్ హోల్డ్‌లో ఉందని, దానికి అవసరమైన పత్రాలు తీసుకు రావాలని చెప్పారు. చేసేదేమి లేక తిరిగి ఇంటికి వచ్చాను.

–వంటి ఆగస్టీన్, పాత గుంటూరు

అడుగడుగునా నీరా'జనం'



సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. గ్రామాలు, వార్డుల్లో పర్యటిస్తూ, ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయా చోట్ల అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభ్యర్థులు ఎక్కడికి వెళ్లినా జనం నీరాజనాలు పలికారు. తాము ఈ ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి ఎన్నో పథకాలు పొంది ఉన్నామని, జగనన్న తమకెంతో మేలు చేశాడని, ఆనందంగా వివరించారు.

వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరితలు మేడికొండూరు మండలం వరగాని గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – మేడికొండూరు

ప్రచార పర్వం



వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం దొప్పలపూడి, పచ్చల తాడిపర్రు, గోళ్లమూడిపాడు, మామిళ్లపల్లి, మునిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులను పలకరించి ఓటు అభ్యర్థించారు. – పొన్నూరు

వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి, మంత్రి విడదల రజిని తుఫాన్ నగర్‌లో ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో సీఎం జగన్ చేసిన మేలును వివరించి, ఓటు అభ్యర్థించారు.

– పట్నంబజారు





మండలంలోని చావావారిపాలెం, అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ తెనాలి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ రోడ్ షో నిర్వహించారు. గ్రామాల్లో అడుగడుగునా ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు.

– తెనాలి రూరల్

ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్‌షోలో పాల్గొన్న కిరణ్‌కుమా ర్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు.మంచి కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

– ప్రత్తిపాడు



నేడు క్రోసూరుకు సీఎం వైఎస్ జగన్



క్రోసూరు మెయిన్‌రోడ్డులో సీఎం సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ
- వైఎస్సార్‌సీపీ అభిమానుల జోష్
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు రానున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి (తహసీల్దార్ కార్యాలయం వెళ్లే రోడ్డు)లో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బహిరంగసభలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి జగన్ ప్రసంగించనున్నారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతమైన రీతిలోనే క్రోసూరు సభను సక్సెస్ చేసేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల ముంగిట ముఖ్యమంత్రి జిల్లాలో జరపనున్న పర్యటన వైఎస్సార్ సీపీ అభిమానుల్లో జోష్ నింపనుంది. మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు సమాయత్తం కానున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన తలశిల రఘురాం

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభ ఏర్పాట్లను గురువారం సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పర్యవేక్షించారు. ఆయనతోపాటు స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పార్టీ యువనాయకులు నంబూరు కళ్యాణ్ చక్రవర్తిలు క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సీఎం హెలిప్యాడ్‌కు అనువైన స్థలంగా గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాట్లు చూస్తున్న సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. తరువాత క్రోసూరు మెయిన్‌రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వెళ్లే రోడ్డులో బహిరంగసభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు.



సీఎం సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కట్టుదిట్ట భద్రత

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు కట్టుదిట్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బింధుమాదవ్ సీఎం హెలిప్యాడ్ ఏర్పాటుచేసిన గ్రౌండ్, బహిరంగసభ జరిగే ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు తదితర విషయాలపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి సభ వరకు సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులను ఇప్పటికే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్పీ పోలీసు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీలు రాఘవేంద్ర, లక్ష్మీపతి, రామచంద్రరాజు, డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.

మరింత వేగంగా పనిచేద్దాం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్నాయని అధికారులు, నోడల్ అధికారులు, నిఘా బృందాలు సమన్వయంతో మరింత వేగంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్నికల పరిశీలకులు, నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులు గుర్తించిన అంశాలతోపాటు, సలహాలను నోడల్ అధికారులు పాటించాలన్నారు. గుంటూరు పార్లమెంట్, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు నీరజ్ కుమార్ మాట్లాడారురు.

మద్యంపై నిఘా పెంచండి...

సమావేశంలో తాడికొండ, ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు కార్తీక మాట్లాడుతూ ఎక్సైజ్ నోడల్ అధికారులు అనధికార మద్యం సరఫరాను అరికట్టేందుకు నిరంతర నిఘా పెట్టి తనిఖీలు చేయాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు పరిశీలకులు సత్యరత్ అనిరుధ్ పంకజ్, ఎస్పీ తుషార్ డూడీ, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, అధికారులు పాల్గొన్నారు.

నాడు మోకాలడ్డు.. నేడు బుజ్జగింపు!


గుంటూరు పశ్చిమలో నేడు టీడీపీ ఆధ్వర్యంలో కాపుల ఆత్మీయ సమావేశం

- ఇప్పటివరకు ఆ సామాజిక వర్గాన్ని పట్టించుకోని టీడీపీ లోక్‌సభ అభ్యర్థి
- కాపులకు ఒక్క సీటు కూడా రాకుండా చక్రం తిప్పిన పెమ్మసాని
- టీడీపీని వీడుతున్న జనసేన, బీజేపీ కాపు నాయకులు
- స్వపక్షంలోని కాపులు సైతం ప్రేక్షక పాత్ర

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల దగ్గరపడుతున్న వేళ తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థికి కాపులు గుర్తుకొచ్చారు. నిన్న మొన్నటి వరకు తన పరిధిలో కాపులకు టికెట్ రాకుండా మోకాలు అడ్డుపెట్టిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు, తాము ఇప్పుడు గుర్తుకు రావడం ఏంటని కాపులు ప్రశ్నిస్తున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కాపుల ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు కాపులను పట్టించుకోకపోగా వారిని అనుమానంగా చూసిన వారికి ఇప్పుడు తమ అవసరం ఏంటని తెలుగుదేశం, జనసేన, బీజేపీలోని కాపు నేతలు ప్రశ్నిస్తున్నారు. పెమ్మసాని అవమానాలు భరించలేక, తమకు తగిన ప్రాతినిధ్యం లేకుండా పోయిందంటూ బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ స్టేట్ కో–కన్వీనర్ డాక్టర్ టి.వి.రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు పార్టీని వీడిన సంగతి తెలిసిందే. గుంటూరు పార్లమెంట్ పరిధిలో 2.70 లక్షలకు పైగా ఓట్లు ఉన్న ఈ సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీ ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదు. పైగా తమ సామాజికవర్గానికే పెద్దపీట వేసింది. జనసేన కూడా అదే సామాజిక వర్గానికి సీటు ఇచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ సీటు, పొన్నూరు ఎమ్మెల్యే సీటును కాపులకు కేటాయించింది. ఇదే విషయాన్ని తెలుగుదేశంలోని కాపు నాయకులు తమ నేతల వద్ద ప్రస్తావించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తరువాత ఎదురైన అవమానాలు భరించలేక టీడీపీకి దూరంగా ఉండిపోయారు. మరోవైపు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య తన సామాజిక వర్గంలో పూర్తి మద్దతును కూడగట్టటం, జనసేనలో ఉన్న అభిమానులు సైతం మద్దతు ఇవ్వకపోవడం వంటి పరిణామాలు టీడీపీని భయాందోళనల్లోకి నెట్టాయి. ఈ నేపథ్యంలోనే ఆత్మీయ సమావేశం పేరిట కాపులను బుజ్జగించడానికి దేశం నాయకులు సిద్ధమయ్యారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

నేటి నుంచి 'హోం ఓటింగ్'

- 85 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- ఇళ్ల వద్దకే పీఓ, ఓపీఓలతో కూడిన స్పెషల్ టీంలు
- 8వ తేదీ వరకు కొనసాగనున్న ఓటింగ్
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగం




85 సంవత్సరాలు నిండిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి 12–డీ ఫారంలను అందిస్తున్న బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు

ప్రత్తిపాడు: ఎన్నికల ప్రక్రియ మొదలయ్యింది. ఈ నెల 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు అందుకు సంబంధించిన అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో ఎన్నికల సంఘం కొత్తగా రాష్ట్రంలో అమలు చేస్తున్న హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రత్తిపాడు నియోజకవర్గంలో నేటి నుంచి మొదలు కానుంది. ఈ నెల 3వ తేదీ నుంచి 8 వరకు హోం ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ముందుగా హోం ఓటింగ్‌కు ఫారం 12–డీ దరఖాస్తు చేసుకున్న 85 సంవత్సరాలు నిండిన, దివ్యాంగుల ఇళ్లవద్దకే వెళ్లి అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్ చేయించనున్నారు.

15 టీంల ద్వారా కార్యక్రమం...

ప్రత్తిపాడు నియోజకవర్గంలో మొత్తం 15 టీంల ద్వారా హోం ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అధికారుల బృందం తమ వెంట పోస్టల్ బ్యాలెట్ పత్రాలతో పాటు సిరా, బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పత్రాలను తీసుకుని వెళతారు.

8వ తేదీ వరకు 15 టీంలతో హోం ఓటింగ్.



హోం ఓటింగ్‌కు ఫారం 12డీ దరఖాస్తు చేసుకుని అర్హత పొందిన వారికి ఈ నెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్ నిర్వహిస్తాం. ఇందుకుగాను మొత్తం పదిహేను టీంలను ఏర్పాటు చేశాం. ఆ టీంలు నేరుగా ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాయి.

– పి.శ్రీకర్, ఆర్ఓ, ప్రత్తిపాడు

ఒక్కో టీమ్‌లో ఎవరెవరు ఉంటారంటే..

- పీఓ
- ఓపీఓ
- మైక్రో అబ్జర్వర్
- కానిస్టేబుల్స్ ఇద్దరు
- బీఎల్ఓ (సంబంధిత ఓటరు ఇళ్లు చూపించేందుకు)



ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



ఈవీఎంల భద్రతపై తూర్పు ఆర్‌ఓ కీర్తిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న పరిశీలకులు కార్తీక

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ కేంద్రమైన ఏసీ కాలేజ్‌ని కేంద్ర ఎన్నికల పరిశీలకులు ఎస్‌పీ కార్తీక గురువారం రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరితో కలసి పరిశీలించారు. ఏసీ కాలేజ్‌లో ఈవీఎంల తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో ర్యాండమైజేషన్ మేరకు ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లు ఆర్డర్‌లో ఏర్పాటు చేయడాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఈవీఎంల కమిషనింగ్ హాల్ పరిశీలించి, కమిషనింగ్ వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది అందరూ ఎన్నికల విధుల గుర్తింపు కార్డులు ధరించాలని ఆదేశించారు. తూర్పు నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లు, అవసరమైన ఈవీఎంలు, కమిషనింగ్‌కు తీసుకుంటున్న చర్యలను ఆర్‌ఓ కీర్తి చేకూరి వివరించారు. ఈ పర్యటనలో ఏఆర్‌ఓ, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ మురళి, ఈఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్‌ఓ(ఎఫ్‌ఏసీ) మధుసూదన్, డీఈఈ రమేష్ బాబు, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

జగనన్న విశ్వసనీయత వైపే జనం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- టీడీపీ, జనసేనల నుంచి భారీ సంఖ్యలో చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి రజిని



పార్టీలో చేరిన మహిళలతో మంత్రి విడదల రజిని

పట్నంబజారు: రాజకీయాల్లో క్యారెక్టర్.. క్యాలిబర్ ఎంతో అవసరం.. నిన్నటి వరకు ఓ మాట మాట్లాడిన చంద్రబాబు.. ఊసరవెల్లిని తలపించేలా సంక్షేమ జపం చేయటం ఎంతో హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి వందలాదిగా టీడీపీ, జనసేన కార్యకర్తలు స్థానిక శ్యామలానగర్‌లోని మంత్రి విడదల రజిని నివాసంలో గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ చంద్రబాబు ఓటమి భయంతో అలవికాని హామీలన్నీ ఎడాపెడా ఇస్తున్నాడని, ప్రజలు వాటిని నమ్మడం లేదని చెప్పారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో తాము ఎవరిని గెలిపించుకోవాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు, ఆయన మిత్రపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా విఫలమవక తప్పదని చెప్పారు. వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. జూన్ రెండో వారంలో జగనన్న మళ్లీ రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు.

టీడీపీ నుంచి కరిముల్లా చేరిక

గుంటూరు 20వ డివిజన్ నల్లచెరువుకు చెందిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు మంత్రి రజిని పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నేత గ్యాలం రవి ఆధ్వర్యంలో 18వ డివిజన్‌కు చెందిన 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ అల్లాబక్షు, షేక్ ఫిరోజ్, షేక్ అలీ, షేక్ ఖాసిం, వెంకటేశ్వర్లు, షేక్ బాబు, షేక్ మస్తాన్, షేక్ ఖాజా, షేక్ రషీద్, షేక్ సుభాని, షేక్ జార్జండ్, షేక్ సాదిక్ ఉన్నారు.

టీడీపీ, జనసేనల నుంచి..

జానీ బాషా ఆధ్వర్యంలో జనసేన, టీడీపీలకు చెందిన 30 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి రజిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

బీసీ బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో..

బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు, ఫ్రంట్ గుంటూరు అర్బన్ మహిళా అధ్యక్షురాలు పి.ప్రశాంతి ఆధ్వర్యంలో వంద మంది మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు.

గడప గడపకు సంక్షేమం జగన్‌కే సాధ్యం

గుంటూరు లోకసభ అభ్యర్థి కిలారి రోశయ్య



పార్టీలో చేరిన వారితో గుంటూరు పార్లమెంట్ లోకసభ అభ్యర్థి కిలారి రోశయ్య

ఫిరంగిపురం: రాష్ట్రంలో గడప గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య అన్నారు. మండలంలోని 113 తాళ్లూరు, కండ్రిక, నుదురుపాడు, ఫిరంగిపురం తూర్పు బజారు ప్రాంతాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తాళ్లూరులో ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతినెల ఒకటో తేదీన పింఛన్లు అందజేయడమే కాకుండా ఎవరికి సంక్షేమ ఫలాలు అందాలో వారికి ఆ వివరాలు తెలియజేసి వారిని సచివాలయం వద్ద దరఖాస్తు పెట్టుకునే విధంగా చేశారని గుర్తు చేశారు. నాడు– నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిని తలదన్నేరీతిలో పాఠశాల భవనాలు ఏర్పాటు చేసి విద్యనందించారని చెప్పారు. అంతే కాక వారికి అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలు ద్వారా ఆర్థికంగా వారు ఇబ్బంది పడకుండా చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తెలిపారు. గతంలో జన్మభూమి కమిటీల ద్వారా మాత్రమే పథకాలు అందేవని ప్రస్తుతం అలా కాకుండా అర్హులైతే చాలు సంక్షేమ ఫలాలు అందేలా జగన్ చేశారని వివరించారు. అనంతరం టీడీపీకి చెందిన డేగల హనుమంతు, పాలపాటి శ్రీనివాసరావు, కె.పుల్లయ్య, పి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కిలారు రోశయ్య పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మార్పులశివరామిరెడ్డి, పాలపాటి రఘు, చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.బైరాగినాయుడు, పి.బాలయ్య, పి.శ్రీనివాసరెడ్డి, వేమారెడ్డి, రాజశేఖరరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.రోశయ్య, వి.వెంకట్రావు, ఎస్.నాగరాజు, పి.చిన్న, చక్కావిజయకుమార్, టి.కృష్ణ, కె.రామారావు, శివాంజినేయులు, ప్రకాశరావు, వీరయ్య, డెబొరా, మల్లికార్జునరావు, లింగయ్య, జనార్ధన్, కె.నాగేశ్వరరావు, కె.అప్పిరెడ్డి, సంజీవరెడ్డి, సీతారామిరెడ్డి, చౌడయ్య, పుల్లారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మా గురించి ఏం తెలుసని ఆరోపణలు



పార్టీలో చేరిన వారితో నూరిఫాతిమా

- ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే.. బాబు డ్రామా
- అవినీతి వ్యాపారాలు చేయాల్సిన అవసరం మాకు లేదు
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా

పట్నంబజారు: ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే.. మా కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నావ్.. అవినీతి వ్యాపారాలు చేయాల్సిన అవసరం మా కుటుంబానికి ఏ మాత్రం లేదని వైఎస్సార్ సీపీ తూర్పు నియోకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గంలోని 4వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ తన తండ్రి తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారని చెప్పారు. ఆయనపై పదేళ్ల కాలంలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా ఏదో కావాలని తమ కుటుంబంపై బురదజల్లే ప్రయత్నం చేయటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు గుంటూరు పర్యటన అట్టర్‌ఫ్లాప్ అవ్వటంతో మైండ్ పోయి, ఎమ్మెల్యే ముస్తఫాపై లేనిపోని ఆరోపణలు చేశారని మండిపడ్డారు. తప్పుడు ఆరోపణలు చేస్తే.. ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు తెల్లకాగితం వంటి తన తండ్రిపై వ్యాఖ్యలు చేయటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఆఖరికి అభ్యర్థులు పేరు కూడా తెలియని చంద్రబాబు మానసిక పరిస్థితి ఏమిటో అర్థమవుతోందన్నారు. తూర్పు నియోజకవర్గంలోని ఎవరెన్ని డ్రామాలాడిన.. వీధి నాటకాలు వేసినా.. వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. సంక్షేమం సారథి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేందుకు.. నియోజకవర్గంలో తనని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ప్రభాకర్‌రెడ్డి, సుబ్బులు, ఫారిద్, అజీస్, తోట మణికంఠ, సాంబిరెడ్డి, నాగేశ్వరి, విజయకుమారి, నాగూల్‌మీరా, గోపి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. గురువారం వైఎస్సార్ సీపీ నేతలు జియావుల్ రెహమాన్, చిన్నమ్మాయి, సుబ్బులు ఆధ్వర్యంలో 14, 57 డివిజన్‌లకు చెందిన 70 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూరజ్, సంతోష్, లక్ష్మీ, జయశ్రీ, నిషాంత్, రాణి, ఆశాబి, గౌస్, సలీం, మస్తాన్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ లైఫ్‌లో ఉద్యోగాలకు 13 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో గురువారం ఎస్‌బీఐ లైఫ్‌లో గ్రాడ్యుయేట్ సేల్స్ ట్రైనీస్ ఉద్యోగాలకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఎంపికయ్యారు. ఇంటర్వ్యూలకు హాజరైన 37 మంది అభ్యర్థుల్లోని నైపుణ్యాలు, సమర్థత ఆధారంగా ఎస్‌బీఐ లైఫ్ సంస్థ డివిజినల్ మేనేజర్ పి. శ్రీనివాస్, హెచ్‌ఆర్ మేనేజర్ విజయ్ సాయి 13 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, జేకేసీ సమన్వయకర్త డాక్టర్ కె.అపర్ణ సీతారామ్, బి.సుధాకర్‌రెడ్డి, జేకేసీ మెంటార్లు మూనిస్‌ఖాన్, కె.అపర్ణ అభినందించారు.

టీడీపీని చావుదెబ్బ తీయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మణ సంఘ నాయకులు

- బ్రాహ్మణ విద్వేషి చంద్రబాబు
- కరణాల ఉసురు తీసి.. అర్చకులను అవహేళన చేసిన ఘనులు
- ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ పిలుపు

పట్నంబజారు: సమాజ హితం కోరుకునే బ్రాహ్మణ జాతి విద్వేషి చంద్రబాబు అని ప్రభుత్వ సలహాదారు, రాష్ట్ర బ్రాహ్మణ సంఘం నేత జ్వాలాపురం శ్రీకాంత్ ధ్వజమెత్తారు. కరణాల ఉసురు తీసి, అర్చకులను అవహేళన చేసి, ధూప దీప నైవేద్యాలకు దూరంగా అనేక ఆలయాలను పాడుబెట్టుకున్న నీచ సంస్కృతి టీడీపీదని మండిపడ్డారు. బృందావన్‌గార్డెన్స్‌లోని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ దేవాలయాలను కూల్చి, సదావర్తితో సహా అనేక సత్రాలు, ఆలయ భూములను అన్యాక్రాంతం చేసి, అన్ని రంగాలలో బ్రాహ్మణ జాతిని అణగదొక్కిన టీడీపీకి గుణపాఠం నేర్పించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. 2019లో చెంప పెట్టులా తీర్పునిచ్చినా సిగ్గు లేకుండా నానా జాతి సమితిని కూడగట్టుకుని మళ్లీ ఎన్నికల బరిలో దిగిన టీడీపీని ఈసారి చావుదెబ్బ తీసేందుకు బ్రాహ్మణులంతా ఐక్యంగా నిలబడి సత్తా చాటాలని కోరారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే బ్రాహ్మణులకు మేలు జరగడం మొదలైందని వివరించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పెరి కామేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో తూతూ మంత్రంగా నడిచిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి తద్వారా రూ.780 కోట్ల మేరకు బ్రాహ్మణులకు ఆర్థిక లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. పార్టీ సీనియర్ నేత బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ టీడీపీని బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ అని, బ్రాహ్మణులను అణగదొక్కేందుకే అవతరించిన పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరామశర్మ, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు కప్పగంతు ఆదిలక్ష్మి, చింతపల్లి రమణ, వలివేటి వెంకటరమణ, పాత్తూరి శ్యాంసుందర్, బందా ఆంజనేయప్రసాద్, దామరాజు శ్రీనివాస్, ఎంవీ సుధాకర్ పాల్గొన్నారు.

పెమ్మసానికి బుద్ధి చెబుతాం

పట్నంబజారు: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బీసీల ద్రోహి అని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు గూడూరి నాని పేర్కొన్నారు. కృష్ణనగర్‌లోని వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి, కిలారి రోశయ్య నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 48 అసెంబ్లీ, 11 పార్లమెంట్ స్థానాలిస్తే.. చంద్రబాబు కేవలం 38 సీట్లుకే పరిమితం చేశారని విమర్శించారు. బీసీలను గుండెల్లో పెట్టుకున్న మంచి మనసున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. అసలు గుంటూరు పార్లమెంట్‌లో ఎన్ని నియోజకవర్గాలు ఉన్నాయో తెలియని పెమ్మసానిని గెలిపిస్తే.. మనకి మనమే ఉరి వేసుకున్నట్లు అవుతుందన్నారు. కాలు తీస్తా.. చేయి నరకుతానంటూ వ్యాఖ్యలు చేస్తున్న పెమ్మసాని గుంటూరు పార్లమెంట్‌ను ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. మన ప్రాంతంలో పుట్టి, ఇక్కడే పెరిగి, పూర్తిస్థాయిలో అన్ని రంగాల్లో అవగాహన ఉన్న కిలారి రోశయ్యను గెలిపించుకునేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్ బూసి రాజలత, బీసీ విభాగం నేత పోకల వసంత్ మాట్లాడారు. అనంతరం జై బీసీ.. వన్స్‌మోర్ వైఎస్సార్ సీపీ అనే పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో బీసీ నేత శివశంకర్‌యాదవ్, వేణు పాల్గొన్నారు.